తలసీమియా బాధితులకు రక్తదానం



మల్లాపూర్: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్ కాలనీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్ కమ్యూనిటీహాల్‌లో కాలనీవాసులు తలసీమియా చిన్నారుల కోసం దాదాపు 30 మంది రక్తదానం చేయగా, వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కాలనీ ఉపాధ్యక్షులు వినోద్, లక్ష్మి, ప్రధాన కార్యదర్శి యాకుబ్‌రెడ్డి, కోశాధికారి విద్యాసాగర్, రాకేష్, కృష్ణ, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



యూజీడీని పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో పాత యూజీడీ స్థానంలో కొత్తగా యూజీడీ నిర్మిస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బీజేఆర్‌నగర్‌లో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని ఫిర్యాదు చేయడంతో శనివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మున్సిపాలిటీ ఉన్నప్పుడు యూజీడీ నిర్వహణ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండేదని, సమస్య త్వరితగతిన పరిష్కారమయ్యేదన్నారు. జలమండలికి నిర్వహణ బాధ్యత అప్పగించిన అనంతరం సమస్య తీవ్రమైందని, పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో అమ్మమ్మల పాత్ర కీలకం



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

బోడుప్పల్: పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్రతో పాటు అమ్మమ్మలు, తాతయ్యల పాత్ర కీలకమైందని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన హిందూ భాషా దినోత్సవం, 'గ్రాండ్ పేరెంట్స్ డే' వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు, అమ్మమ్మలు, తాతయ్యలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్‌అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాప్రాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కాప్రా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కాప్రా డివిజన్‌లో పర్యటించారు. చంద్రపురికాలనీలో నివాసం ఉంటున్న ఏషియన్ గేమ్స్ రజత పతకం గ్రహీత అగసర నందిని ఇంట్లోని గణపతి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం శివపురికాలనీలో పలు గణనాథుల మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. స్థానికనేతలు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకున్న గంగరాజు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల అధినేత జె.గంగరాజుకు డిజిటల్ శాటిలైట్ స్కూల్, ట్రస్మా సంయుక్తంగా బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును ప్రదానం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ట్రస్మా ముఖ్య సలహాదారులు యాదగిరిశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరిరావు, ఎబీఎస్‌ఏ డైరెక్టర్ సిజా అగస్టస్ చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాలలో సాంప్రదాయ, జాతీయ పండుగల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని అవార్డు అందజేశారని గంగరాజు చెప్పారు. తనకు ఈ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఆసుపత్రిలో చేతినుంచి జారిపడి..

బాధితుడికి బ్రాస్లెట్‌ను అందజేసిన పోలీసులు

కుషాయిగూడ: 20 రోజుల క్రితం సూర్య ఆసుపత్రిలో చేతి నుంచి జారిపడిన 5 తులాల బంగారు బ్రాస్లెట్ శనివారం బాధితుడు వీఎన్‌రెడ్డినగర్ శ్రీసాయి వెంకటకృష్ణ ఎంక్లేవ్ నివాసి మోహన్‌రెడ్డికి కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అప్పగించారు. పోలీసులు తమ విలువైన బంగారాన్ని తిరిగి అప్పగించడంతో బాధితుడు మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. సీసీకెమెరాలను ప్రతి కాలనీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ రంగన్నలను ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

తల్లీకూతురి అదృశ్యం



కుమార్తెతో జానకి (ఫైల్)

మల్కాజిగిరి: తల్లీకుమార్తె అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌టాప్ కాలనీకి చెందిన సౌమ్యనాయక్, జానకి (24) భార్యాభర్తలు. వీరికి నాలుగేళ్ల పాప లావణ్య సంతానం. కాగా రెండ్రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈనెల 12న భర్తకు ఫోన్‌చేసి పనిమీద బయటకు వెళ్తున్నానని, కుమార్తెను ట్యూషన్ వద్ద వదిలిపెట్టానని భర్తకు చెప్పి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జై బోలో గణేష్ మహారాజ్‌కి జై !

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం పలుచోట్ల మహిళలు వినాయక మండపాల వద్ద దీపాలంకరణతో పాటు ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.
– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం

రూ.3 లక్షలు పలికిన గణపయ్య లడ్డూ..



భవానీ యూత్ ఆధ్వర్యంలో పూజల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



విమలాదేవినగర్‌లో దీపాలంకరణతో మహిళలు



పీర్జాదిగూడలో మేయర్ అమర్‌సింగ్



చర్లపల్లిలో మందముల పరమేశ్వర్‌రెడ్డి



మల్కాజిగిరి గీతానగర్‌లో...



అన్నదాన కార్యక్రమంలో మేయర్‌అజయ్‌యాదవ్



పీర్జాదిగూడలో తోటకూర వజ్రేష్‌యాదవ్



నాచారం ఎర్రకుంటలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఆర్‌కేనగర్ రాజుయాదవ్ మండపం వద్ద మైనంపల్లి



మల్లాపూర్ మల్లికార్జున్‌నగర్‌లో బేతి సుభాష్‌రెడ్డి



ప్రత్యేక పూజల్లో బీజేపీ నేత గున్నాల చంద్రశేఖర్‌యాదవ్

వెంకటరమణకాలనీ లడ్డూకు భారీ ధర..



మల్లాపూర్ : గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడి లడ్డూ వేలం పోటాపోటీగా జరిగింది. వెంకటరమణ కాలనీలో లడ్డూను కాలనీకి చెందిన బోళ్ల శ్రీనివాస్‌రెడ్డి రూ.3 లక్షలకు కైవసం చేసుకున్నారు. అనంతరం ఆయనకు కాలనీ అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి లడ్డూను అందజేసి సన్మానించారు.

118 రకాల నైవేద్యం..



మేడిపల్లి : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20వ డివిజన్ శ్రీసాయి ఆనందమయిగేటెడ్ కమ్యూనిటీలోని గణనాథుడికి శనివారం కమ్యూనిటీ మహిళలంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి 118 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగు సమస్యతో పాటు రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, వాటిని పరిష్కరించాలని కోరుతూ చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్‌లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్ మున్సిపాలిటీ మురుగునీటి పైపులైన్‌ను చిలుకానగర్ చిన్న పైపులైన్‌లో కలపడంతో ఏళ్ల తరబడి నిత్యం మురుగు సమస్యతో పాటు ఇతర సమస్యలతో ఇబ్బందిపడుతున్నామని, కమిషనర్‌ను కోరామన్నారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు.

పీఎల్‌ఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ సర్వసభ్య సమావేశం

కాప్రా: పీఎల్‌ఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ 7వ వార్షిక సర్వసభ్య సమావేశం సాకేత్ ప్రణమ్ కళావేదికలో శనివారం నిర్వహించారు. ఈ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు దాదాపు 64 లక్షల మంది సొసైటీ సభ్యుల దాతల సహకారంతో విద్యార్థులకు వివిధ కోర్సుల్లో విద్యను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అడ్వైజరీ బోర్డు సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కోచర్లకోట నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించాలి



రామంతాపూర్: రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు శనివారం స్థానిక మధురానగర్‌లో ఔత్సాహిక అడ్వకేట్ రాజేష్ ప్రజాపతి ఏర్పాటు చేసిన న్యాయ సలహా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ.. సమాజంలోని పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందిస్తూ.. లోక్ అదాలత్ ద్వారా వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు.

సీతారాం ఏచూరి సంతాపసభ



కాప్రా: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతిక్షణం కార్మిక, కర్షక సమస్యలపై ఏచూరి పోరాటం చేసేవారని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. సారంపల్లి మల్లారెడ్డి, చంద్రశేఖర్, రవి, అశోక్, శ్రీనివాసులు, సంతోష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు

కాప్రా: జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి 5వ మహాసభలు ఏఎస్‌రావునగర్ అణుపురం కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తుందని, ప్రస్తుతం మనం కౌంటర్ రెవల్యూషన్‌లో ఉన్నామన్నారు. మానవసంబంధాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, త్యాగాల నుంచే జ్ఞానం వచ్చిందని, పాఠాలు, చరిత్రను మారుస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రముఖ పోషకాహార శాస్త్రవేత్త డాక్టర్ మోహబాత్ ఎస్. బాంజి మాట్లాడుతూ.. సమాజాన్ని చెడుదారి నుంచి మంచి మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మహిళలకు కావాల్సిన కనీస పోషకాహారం సరిగ్గా అందడంలేదని, ప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించాలన్నారు. వరప్రసాద్ ఆనంద్‌కుమార్, రాజా, రమాదేవి, నాగరాజు, బురాన్, జెన్నీ, మల్లయ్యచారి, అండాలి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ హేమాలతాజగ్గారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ సరస్వతి నగర్ కాలనీ వీధి నెంబర్-3లోని ఎంకేటవర్స్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమాలతాజగ్గారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

శుభాకాంక్షలు

రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ ఇటీవల రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన నిరంజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే బీసీ కులగణన కార్యక్రమానికి రాజకీయ పార్టీలు కుల సంఘాలు, అధికారులకు సహకరించాలని కోరారు.

17 నుంచి 'స్వచ్ఛత హీ సేవా'

ఘట్‌కేసర్: మున్సిపల్ పరిధిలో పక్షం రోజుల పాటు నిర్వహింప తలపెట్టిన 'స్వచ్ఛత హీ సేవా-2024' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కమిషనర్ సాబేర్ అలీ ఆదేశానుసారం మున్సిపల్ సిబ్బంది శనివారం ఘట్‌కేసర్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో శ్రీను, మధు, సందీప్, యదేశ్, రాజేశ్, మహేందర్, కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్‌లో ఓనమ్ వేడుకలు



కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక దివ్యాంగుల స్కూల్‌లో ఓనమ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు ఓనమ్ వేడుకల ప్రత్యేకత, విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనురాగ్ స్కూల్ ద్వారా సేవలు అందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రామ్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సౌత్ ఇండియా బ్యాంక్ మేనేజర్ సుహాథామస్, ఎన్‌సీటీఈ విశ్రాంత డైరెక్టర్ వాసుదేవన్, తవాడు ప్రెసిడెంట్ రామచంద్రన్‌నాయర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ



రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లోని సత్యసాయి హైస్కూల్ బాలికలు ఇటీవల ఉప్పల్ మండల స్థాయిలో నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. బాలుర విభాగంలో విద్యార్థులు కబడ్డీలో రెండోస్థానం సాధించగా, ఈ మేరకు శనివారం స్కూల్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో స్కూల్ చైర్మన్ గడ్డం సాయి కిరణ్ విద్యార్థులను అభినందించి చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ వెంకట్‌సాయి, డైరెక్టర్ గడ్డం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీసాయి నటరాజ్ కూచిపూడి అకాడమీ గురువు తులసి శిష్యబృందంచే నిర్వహించిన సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా తబలా విద్వాంసులు శంకర్, రమణాచారిలు హాజరై కళాకారులను అభినందించారు.

